

పలాస, టెక్కలిలో డివిజన్ స్థాయి రెవెన్యూ సమావేశాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో రెవెన్యూ పరిపాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పలాస డివిజన్ రెవెన్యూ అధికారుల సమావేశాన్ని ఈనెల 30వ తేదీన పలాసలో నిర్వహించనుండగా, జూలై రెండో తేదీన టెక్కలిలో టెక్కలి డివిజన్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించి, పరిష్కార మార్గాలు సూచించనున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యపు నీడలో...!



శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్


నిలిచిన భవన నిర్మాణ పనులు

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యాలయం (ట్రిపుల్ ఐటి) శ్రీకాకుళం క్యాంపస్ సమస్యలతో సహవాసం చేస్తోంది. ట్రిపుల్ ఐటి ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తయినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. నేటికీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ఊసే లేదు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికనే నియామకాలు సాగుతున్నాయి. ఇక మౌలిక వసతుల గురించి ఎంత తక్కువ చెప్పకుంటే అంత మంచిది. అసంపూర్తి భవన నిర్మాణాలు ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా దర్శనమిస్తున్నాయి.

- **శ్రీకాకుళం ఆర్‌జియుకెటి క్యాంపస్‌ని వేధిస్తున్న వసతి కొరత**
- **తొమ్మిదేళ్లు పూర్తయినా వెంటాడుతున్న సమస్యలు**
- **ప్రభుత్వాలు మారినా మౌలిక వసతులు మృగ్యం**
- **పూర్తిస్థాయి క్యాంపస్ నిర్వహణ ఎప్పటికి సాధ్యమయ్యేనో?**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యాలయం (ట్రిపుల్ ఐటి) ప్రతిష్టాత్మక విద్యాసంస్థ. అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో విద్యనందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైంది. శ్రీకాకుళం జిల్లాలో ఎచ్చెర్ల మండలం షేర్‌మహమ్మద్ పురం (ఎస్‌ఎం పురం) గ్రామ పరిధిలో 2016 అక్టోబర్ 9న అప్పటి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అప్పటికే నిర్మించిన 21వ శతాబ్ది గురుకుల భవనాల్లో ప్రారంభించారు. ఏడాదికి 1100 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. కనీస మౌలిక వసతులు ఇప్పటికీ సాధ్యం కాలేదు. రెగ్యులర్ టీచింగ్, నాన్ టీచింగ్ రిక్రూట్‌మెంట్ లేదు. స్థానికంగా అద్దె క్యాంపస్, నూజివీడు క్యాంపస్‌లో క్లాసులు విభజించి నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా పరిస్థితుల్లో మార్పు లేదు. ఆర్‌జియుకెటిలో సమీకృత ఇంజినీరింగ్ ఆరేళ్ల కోర్సు నిర్వహిస్తున్నారు. రెండేళ్లు పియుసి (ప్రీ యూనివర్సిటీ కోర్స్), నాలుగేళ్ల ఇంజినీరింగ్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజ్ ఇవ్వడం వల్ల, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల మెరిట్ విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు.

మౌలిక వసతులు మృగ్యం

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో మౌలిక వసతుల కోసం 200 ఎకరాలు కేటాయించారు. గత వైసిపి ప్రభుత్వం నిధుల కొరత లేకుండా క్యాంపస్‌ను గ్రీన్ ఛానల్‌లోకి తీసుకొచ్చింది. రూ.157 కోట్లు కేటాయింపులు చేసినా, ఆ నిధులు మాత్రం మంజూరు కాలేదు. భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైంది. ఈ కాలంలో కనీస నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. అసంపూర్తి భవనాలపై దృష్టి పెట్టలేదు. దీంతో వసతి ప్రధాన సమస్యగా మారింది. ప్రధానంగా వసతిగృహాల సముదాయం కొరత, రన్నింగ్ నీటి సౌకర్యం వేధిస్తోంది. కొండ కావడం వల్ల బోర్లు నుంచి అవసరానికి సరిపడా నీరు లభ్యం కావడం లేదు. మరోవైపు ముగ్గురు ఉండాల్సిన గదుల్లో ఆరుగురు నుంచి ఎనిమిది మంది వరకు ఇరికిస్తున్నారు. పూర్తిస్థాయి వసతి కల్పనకు రూ.200 కోట్ల వరకు అవసరం. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తేనే ఇది సాధ్యం. పూర్తిస్థాయి సామర్థ్యం గల క్యాంపస్ ఎప్పటికి సాధ్యమవుతుందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది.

ప్రభుత్వాల నిర్లక్ష్యం

ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో కొన్నేళ్లుగా పియుసి రెండేళ్లు, ఇంజినీరింగ్ మొదటి రెండేళ్లు క్లాస్ వర్క్ నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ మూడు, నాలుగేళ్ల క్లాస్ వర్క్ నూజివీడు ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో నిర్వహిస్తున్నారు. పియుసి మొదటి రెండేళ్లు పురుషు లకు చిలకపాలెంలో అద్దెకి తీసుకున్న శివానీ క్యాంపస్‌లో క్లాస్ వర్క్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నుంచి పియుసి మొదటి ఏడాది నూజివీడులో క్లాస్ వర్క్ నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్లాస్ వర్క్ జూలైలో ప్రారంభం కానుంది. శివానీ క్యాంపస్‌లో పియుసి రెండో ఏడాది క్లాస్ వర్క్ నిర్వహణకు సిద్ధమవుతున్నారు. ఎస్‌ఎం పురం ప్రభుత్వ క్యాంపస్‌లో ఇంజినీరింగ్ మొదటి, రెండు, మూడు, నాలుగేళ్లు నిర్వహించాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. వసతి కొరత వెంటాడుతున్నా అధికారులు ఈ మేరకు తరగతుల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. మరోవైపు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికనే నియమిస్తున్నారు. క్యాంపస్ ఏర్పడి తొమ్మిదేళ్లవుతున్నా రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదంటే ప్రభుత్వాల నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతోంది. ఇప్పటికైనా వసతులు సమకూర్చి, విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి క్యాంపస్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. మౌలిక వసతుల కొరత, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది రిక్రూట్‌మెంట్ వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే తాత్కాలిక వసతి ఏర్పాటు చేస్తాం.

- అమరేంద్ర కుమార్,
రిజిస్ట్రార్, ఆర్‌జియుకెటి


సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలి

- **ఆగస్టు 30, 31న సిఐటియు జిల్లా మహాసభలు**
- **సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై తొమ్మిదో తేదీన చేపడుతున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె సందర్భంగా అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రదర్శనల్లో కార్మికులు, స్కీమ్‌వర్కర్లు పెద్దఎత్తున పాల్గోవాలని కోరారు. ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్మిక వర్గం పోరాడి త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చివేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, పెట్టుబడిదారులకు ఉద్యోగులు, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్‌ఐసి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంభిస్తోందన్నారు.

ఆగస్టు 30, 31న సిఐటియు జిల్లా మహాసభలు

సిఐటియు జిల్లా మహాసభలు ఆగస్టు 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఐటియు మండల, అనుబంధ సంఘాల మహాసభలు జూలై, ఆగస్టులో నిర్వహించాలన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభలు డిసెంబరు 31 నుంచి 2026 జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతాయని వెల్లడించారు. సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎన్.వి రమణ, ఎస్.లక్ష్మీనారాయణ, హనుమంతు ఈశ్వరరావు, ఎం.ఆదినారాయణమూర్తి, ఆర్.ప్రకాశరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సుధ, కె.కల్యాణి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర, పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్ కుమార్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకు ఉద్యోగులకు ఎటువంటి ఆర్థికపరమైన లాభం చేకూర్చలేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ విమర్శించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు 2023 నుంచి బకాయి పడిన డిఎలు, పిఆర్‌సి కమిటీని నియమించి ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఇటీవల బదిలీల్లో రిలీవర్లు లేక చాలామంది పాత స్థానాల్లోనే ఉండిపోయారని, వెంటనే వారిని రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 30నాటి రోల్ ఆధారంగా పాఠశాలలకు పోస్టులు కేటాయించారని, మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసి పోస్టులు కేటాయించారని తెలిపారు. జూన్ 30వ తేదీ రోల్ ఆధారంగా రేషనలైజేషన్ చేస్తామనడం సరికాదన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్ బలోపేతం కావాలంటే రోల్‌తో సంబంధం లేకుండా పోస్టులు కేటాయించాలని సూచించారు. జూన్, జూలైలో చాలామంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేస్తున్నారని, వీరి స్థానంలో నెలవారీ ప్రమోషన్లతో భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలకు రావాల్సిన స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్ 50 శాతాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో చాలా మండలాల్లో ప్రాథమికోన్నత పాఠశాలలను మూసివేశారని తెలిపారు. మందస మండలంలో మొత్తం పది యుపి స్కూల్స్‌ను మూసివేసి బడుగు బలహీన వర్గాల పిల్లలకు విద్యను దూరం చేశారని విమర్శించారు. మందస ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మందసలో మూసివేసిన ప్రాథమికోన్నత పాఠశాలలను వెంటనే తెరిపించాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.వైకుంఠరావు, సహాధ్యక్షులు కె.దాలయ్య, బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి- కొత్తూరు


నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఆదివాసీ గిరిజనులు పండించిన పైనాపిల్, నిమ్మ, అరటి తదితర అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి, జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లి సంత కేంద్రం వద్ద గిరిజనులు తాము పండించుకున్న పంటలతో ఆదివారం నిరసన తెలిపారు. మాట్లాడుతూ ముఖ్యంగా ఈ సీజన్‌లో పండిస్తున్న పైనాపిల్, నిమ్మ, అరటి తదితర పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులు, వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. దీంతో సరైన గిట్టుబాటు కాక గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన అటవీ ఉత్పత్తులను రోడ్లు పాలు చేయాల్సి వస్తుందని వాపోయారు. సంత కేంద్రానికి తెచ్చిన అటవీ ఉత్పత్తులు సరైన ధరకు చెల్లుబాటు కావడం లేదన్నారు. గిరిజనులు పండించిన ప్రతి పోడు వ్యవసాయ పంటలనూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పైనాపిల్ కనీస ధర రూ.20 కూడా చెల్లుబాటు కాకపోవడం లేదన్నారు. పైనాపిల్, నిమ్మ, అరటి పండించిన రైతులందరికీ స్థిరమైన ధర కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజనులు సవర ఎండయ్య, సవర సురేష్, సవర రాజారావు, సవర అబ్రుం, సవర రాజేష్ పాల్గొన్నారు.

3న 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' సమావేశం

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట



వైసిపి ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' ఇంటింటి ప్రచారంపై కార్యాచరణను రూపొందించేందుకు జూలై మూడో తేదీన శ్రీకాకుళం నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర సమన్వయకర్త కురసాల కన్నబాబు, జిల్లా పరిశీలకులు కె.రవిబాబు హాజరవుతారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. చంద్రబాబు మేనిఫెస్టో హామీలపై ప్రజలకు వాస్తవాలను వివరిస్తూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ఐదు వారాల కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా ఆదర్శంగా నిలవాలన్నారు.

ఎల్‌ఐసి నిర్వీర్యానికి కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న గణేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసిని బలహీనపరిచే విధానాలను అవలంభిస్తోందని విశాఖ డివిజన్ ఇన్సూరెన్స్ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.బి గణేష్ విమర్శించారు. స్థానిక ఒక హోటల్‌లో ఆదివారం నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1956లో జీవిత బీమాను జాతీయం చేసిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.ఐదు కోట్ల పెట్టుబడి పెట్టిందని, ప్రతిఫలంగా ఎల్‌ఐసి ఏటా కేంద్ర ప్రభుత్వానికి రూ.వేలాది కోట్లు డివిడెంట్ రూపంలో చెల్లిస్తోందని చెప్పారు. 2023-24 సంవత్సరానికే రూ.6103 కోట్లు చెల్లించిందన్నారు. రూ.లక్షల కోట్లు మౌలిక రంగాల్లో పెట్టుబడి పెడుతూ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. క్లయిమ్స్ చెల్లింపులో ప్రపంచంలోనే ముందువరుసలో ఎల్‌ఐసి ఉందన్నారు. ఉత్తమ బ్రాండ్‌గా ప్రపంచంలో మూడో స్థానంలో ఉందన్నారు. ఇన్సూరెన్స్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రతిపాదన దేశ ప్రయోజనాలకు, పట్టాదారుల ప్రయోజనాలకు నష్టదాయకమన్నారు. జూలై తొమ్మిదో తేదీన చేపట్టే అఖిల భారత సమ్మెకు ఎల్‌ఐసి పెన్షనర్ల మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు ఎ.ఎస్ రవిశేఖర్, భాస్కరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.నారాయణ, ఎం.ఆదినారాయణమూర్తి కోశాధికారి మోహన్‌రాజు, ఎం.వి కామేశ్వరరావు. ఎం.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సూచికలకు గణాంకాలు దోహదం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ


నోబిస్ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న సిపిఒ కార్యాలయ అధికారులు

దేశంలో ప్రణాళికా రచన ఫలితాల అంచనా, అభివృద్ధి సూచికల తయారీలో గణాంకాలు దోహదపడతాయని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి వి.ఎస్.ఎస్. లక్ష్మీప్రసన్న తెలిపారు. నగరంలోనిసిపిఒ కార్యాలయంలో ప్రశాంత చంద్రమహల్ నోబిస్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణాంకాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లఇర్పంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణాంక పితామహుడు నోబిస్ నమూనా సర్వేల రూపకల్పనను మొట్టమొదట దేశంలో ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రణాళికా సంఘ సభ్యునిగా విలువైన సూచనలను చేశారని చెప్పారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు చైర్మన్‌గా వ్యవహరించారని తెలిపారు. వ్యవసాయ పంట విస్తీర్ణం, వాటి ఉత్పత్తి గణాంకాలను శాస్త్రీయ పద్ధతిలో లెక్కించేందుకు రూపకల్పన చేశారని చెప్పారు. కార్యక్రమంలో బి.సుధాకరరావు, ప్రణాళికా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివిలో మెరుగైన విద్యా ప్రమాణాలే లక్ష్యం

- **ప్రైవేటుకు ధీటుగా బోధన**
- **డిమాండ్ పెరగడంతో సీట్ల పెంపు**
- **సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి శశిభూషణ్**





ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కస్తూరిబా గాంధీ విద్యాలయాలు పేద విద్యార్థినుల పాలిట వరమని సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి డాక్టర్ సంపతరావు శశి భూషణ్ తెలిపారు. బాలికలకు మెరుగైన విద్యను అందిస్తున్నామని అన్నారు. సీట్లకు సైతం ఎంతో డిమాండ్ ఏర్పడుతుందని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు లేని, సింగిల్ పేరెంట్ పిల్లలకు ప్రమాణాలు, ఆత్మీయతతో కూడిన విద్య అందుతుందన్నారు. జిల్లాలో 25 కెజిబివి విద్యాలయాలు ఉన్నాయని తెలిపారు. ఒక సంస్థలో 280 సీట్లు లక్ష్యం కాగా, డిమాండ్ మేరకు పెంచి సీట్లు ఇస్తున్నామని అన్నారు. విద్యాలయాల కరిక్యులం, విద్యా ప్రమాణాలు, కల్పిస్తున్న సౌకర్యాలు వంటి అంశాలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వెల్లడించారు.

? కెజిబివిల్లో ప్రవేశాలు ఎలా ఉన్నాయి?

ప్రవేశాలు శతశాతం జరుగుతున్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలు మెరుగ్గా ఉన్నాయి. ఆరు నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయాడాది తరగతుల్లో ఒక్కో తరగతిలో 40 సీట్లు ఉండగా, అన్నీ నిండుతున్నాయి. డిమాండ్ మేరకు పెంచి సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నాం. జిల్లాలోని 25 ఉన్నాయయి. అందులో ఎచ్చెర్ల, శ్రీకాకుళం రూరల్, సంతబొమ్మాళి వంటి ప్రాంతాల్లో సీట్లకు డిమాండ్ ఉంది. ఐదు శాతం పెంచి 280 సీట్లకు 310 ప్రవేశాలు కల్పించాం.

? సీట్లు పెంచాలంటే ఎటువంటి మార్గదర్శకాలు వర్తిస్తాయి?

నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధనల మేరకు కెజిబివి కరిక్యులంలో తరగతికి 40కి మించి ప్రవేశాలు కల్పించకూడదు. భోజనం సంబంధించి రేషన్ 280 మంది విద్యార్థులకు అందజేస్తారు. సీట్లు పెంచినా ఇదే భోజనం సరిపెట్టాల్సి ఉంటుంది. మరోపక్క నిత్యావసర సరుకుల రేషన్ సైతం నిర్దేశిత విద్యార్థులు దృష్టిలో పెట్టుకొని కల్పిస్తారు. స్థానిక అవసరాల మేరకు సీట్లు పెంచి ప్రవేశాలు కల్పిస్తున్నాం.

? 30 మండలాలకు 25 కెజిబివిలు ఉన్నాయి, మరో ఐదు ఏర్పాటు చేస్తారా?

జిల్లాలో ఐదు మండలాలు నరసన్నపేట, టెక్కలి, పలాస, వజ్రపుకొత్తూరు, సరుబుజ్జిలిలో కెజిబివిలు లేవు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కేంద్ర పౌర విమానయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకెళ్లాం. భవిష్యత్‌లో ఏర్పాటుకు అవకాశం ఉంది. మహిళా అక్షరాస్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది. భవిష్యత్‌లో జిల్లాలో గిరిజన ప్రాంతాల్లో విద్యాలయాలు ఏర్పాటు అవసరం.

? ఇంటర్ విద్యకు విస్తరించే అవకాశం లేదా?

ప్రస్తుతం ఒక్క గ్రూప్ మాత్రమే కెజిబివిలో నిర్వహిస్తున్నాం. 13 చోట్ల ఎంపిసి, ఎనిమిది చోట్ల బైపిసి, రెండు చోట్ల సిఇసి, రెండు చోట్ల ఎంఎల్‌టి నిర్వహిస్తున్నాం. భవిష్యత్‌లో ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా పెంచుతాం.

? ఎంతమంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు?

ప్రస్తుతం 323 మందికి 322 మంది టీచింగ్, 310 మందికి 276 మంది నాన్ టీచింగ్ పనిచేస్తున్నారు. అవసరం మేరకు నియామకాలు చేపడుతున్నాం.

? టీచింగ్, నాన్ టీచింగ్ బదిలీ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది?

టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది బదిలీలను మ్యూచువల్ పద్ధతిలో నిర్వహిస్తాం. ఆన్‌లైన్ దరఖాస్తు ఆధారంగా అభ్యంతరాల స్వీకరించి ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా బదిలీలు చేపడతాం.

? విద్యా ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 90 శాతం దాటి ఫలితాలు సాధిస్తున్నాం. భవిష్యత్‌లో ఇంకా మెరుగైన ఫలితాలు లక్ష్యం. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా మా విద్యార్థులు మార్కులు సాధిస్తున్నారు. పేద విద్యార్థులకు ఈ విద్యాలయం మంచి అవకాశం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీసేలా ప్రమాణాలు పాటిస్తున్నాం.

? మౌలిక వసతులు ఎలా ఉన్నాయి?

చాలావరకు మెరుగ్గా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ సహకారంతో విద్యార్థుల సంఖ్య బట్టి మౌలిక వసతులు కల్పన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుంది.



సన్మానిస్తున్న గ్రామస్తులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం బందావనం ఎంపిపి పాఠశాలలో పనిచేసి ఉపాధ్యాయులు ఆర్.శ్యామలకు గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎనిమిదేళ్లుగా పనిచేసి ఎంతో మంది విద్యార్థులకు విద్యాభ్యాసం నేర్పినందుకు గ్రామం తరపున దుశ్శాలు కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శోభారాణి, ఉపాధ్యాయులు జ్యోతి, స్కూల్ కమిటీ చైర్మన్ రామలక్ష్మి, గ్రామస్తులు రవి, సీతారాములు, తారకేశ్వరరావు, శ్రీనివాసు, గంగయ్య, ఉమాపతి, ప్రసాద, శేఖర్, సుబ్బారావు, లక్ష్మణరావు, బ్రహ్మానందం పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న సంఘ సభ్యులు

మొక్కలను సంరక్షించాలి

ప్రజాశక్తి- మందస

భూమిపై సకల జీవరాసులకు ఆక్సిజన్ అందించి, వాతావరణ సమతుల్యానికి అందరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని తప్పనిసరిగా సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఐటిడిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని పొత్తంగి గ్రామ సంఘంలో వన సంరక్షణలో భాగంగా మహిళలతో ఆదివారం మొక్కలు నాటించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చాలా సందర్భాల్లో మొక్కలను నాటడం చేస్తున్నారే తప్ప, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోకపోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు కాంతమ్మ, విజయ,తో పాటు వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు రమేష్, మంగమ్మ, లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్ , డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు,పొత్తంగి వి.ఓ.ఏ.భారతి తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న వైసిపి నాయకులు

మాజీ మంత్రికి సన్మానం

పలాస : కాశీబుగ్గ జిఎంఇ కాలనీలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నివాస గృహంలో ఆదివారం వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ వైసిపి పట్టణ కమిటీ ఉపాధ్యక్షునిగా నర్తు వెంకటరమణ ఇటీవల నియమితులయ్యారు. ఈ మేరకు వెంకటరమణ మాజీమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, పట్టణ కార్యదర్శి రంధి రాజారావు పాల్గొన్నారు.



రోడ్డుపై నిలిపిన వాహనాలు

చేపల మార్కెట్ రోడ్డుకు ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మేజర్ పంచాయతీ టెక్కలి చిన్నబజార్ చేపల మార్కెట్ వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఆది, మంగళవారాలు చేపల మార్కెట్‌కు మండలంలోని ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తారు. అయితే రోడ్డుపై కూరగాయలు, తోపుడు బళ్లు పెడుతున్నారు. వాహనాలు పార్కు చేసుకోడానికి స్థం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే మార్గాన గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో షాపింగ్ కాంప్లెక్స్ రోడ్డుపైనే నిర్మాణం చేపట్టారు. వాహనాలు పెట్టుకోవడానికి స్థలం లేదు కదా వెళ్లడానికీ దారి లేదు. అడ్డంగా తోపుడు బళ్లు పెట్టడంతో అవస్థలు పడుతున్నారు. తోపుడు బళ్లతో పాటు బడ్డీ దుకాణాలు రోడ్డుకి ఆనించి పెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు మీదుగా గొల్ల వీధి, కొర్ర వీధి ప్రజలు వెళ్లి వస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై దుకాణాలు లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

సీనియర్ సిటిజన్ కార్డుతో ప్రయోజనాలెన్నో..

- ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగానే కార్డు
- అవగాహన లేకే చాలా మంది తీసుకోవడం లేదు



ప్రజాశక్తి- రణస్థలం

మీరు 60 ఏళ్లు దాటిన వాళ్లు అయితే ఖచ్చితంగా సీనియర్ సిటిజన్ కార్డు తీసుకోవాల్సిందే. ఎందుకంటారా ఈ కార్డుతో బోలెడు ప్రయోజనాలు ఉన్నాయి. అది మీ చేతిలో ఉంటే వజ్రాయుధం ఉన్నట్టే. మరి దీని ఉపయోగాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. అదే విధంగా ఈ కార్డును ఎలా పొందాలో కూడా తెలుసుకుందాం.

టికెట్‌లో 25 శాతం రాయితీ: ఆర్‌టిసి బస్సు టికెట్‌లో 25 శాతం రాయితీ లభిస్తుంది. దూరప్రాంతాలవి కాకుండా ఇతర ఆర్‌టిసి బస్సుల్లో వృద్ధులకు ప్రత్యేకంగా రెండు సీట్లు రిజర్వ్ చేస్తారు. అదే విధంగా రైల్వేస్టేషన్లలో కూడా వయోవృద్ధులకు స్పెషల్ టికెట్ కౌంటర్లు ఉంటాయి. అవసరమైన వారు వినియోగించుకునేందుకు వీల్‌ఛైర్ సదుపాయం సైతం ఉంటుంది. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, 45 ఏళ్లపైగా వయసుండి ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, గర్భిణులకు లోయర్ బెర్తుల రిజర్వేషన్‌లో ప్రాధాన్యత ఉంటుంది. ఇందుకు ఒక్కో స్లీపర్ కోచ్‌లో 6 బెర్తులు కేటాయిస్తారు. థర్డ్‌ఏసిలో4, సెకెండ్‌ఏసిలో 3 బెర్తులు రిజర్వ్ చేస్తారు.

కోర్టు కేసుల్లోనూ: సీనియర్ సిటిజన్‌లకు సంబంధించిన కేసుల విచారణ విషయంలోనూ కోర్టులు ప్రాధాన్యమిస్తాయి. వారు లేఖ రాసినా లేదా విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోరినా వారి కేసులకు స్పెషల్‌గా విచారణ తేదీలు కేటాయిస్తారు. అదేవిధంగా పాస్‌పోర్టు సేవల్లోనూ ఫీజులో 10 శాతం తగ్గింపు ఉంటుంది. పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో ఈ కార్డు ఉన్న వారికి ప్రత్యేకంగా టోకెన్లు జారీ చేస్తారు.

బ్యాంకింగ్ సేవల్లోనూ: బ్యాంకుల్లో స్పెషల్ క్యూ ఉంటుంది. కొన్ని బ్యాంకుల్లో ప్రత్యేకంగా ఓ కౌంటర్ ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 60-79 ఏళ్ల మధ్య ఉన్న వారికి 0.5 శాతం అదనపు వడ్డీ రేటు లభిస్తుంది. 80 ఏళ్లపైబడిన వారికి 1 శాతం వడ్డీరేటు లభిస్తుంది. కొన్ని బ్యాంకుల్లో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీమ్‌లో 80 ఏళ్లపైబడిన వారికి 8.5 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. 60-79 ఏళ్ల మధ్య ఉన్న వారికి 7.9 శాతం వడ్డీరేటు ఉంటుంది. కొన్ని బ్యాంకుల్లో డెబిట్ కార్డుపై ఫీజు మినహాయింపు వర్తిస్తుంది. ఎటిఎంల నుంచి డబ్బు తీసుకునేందుకున్న అవకాశాల కంటే ఎక్కువగా ఉంటుంది.

పన్ను మినహాయింపులు: 60 ఏళ్లు పైబడిన వారికి రూ.3 లక్షల వరకు, 80 ఏళ్లు పైబడిన వారికి రూ.5 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు లభిస్తుంది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై 80 సీ సెక్షన్ కింద పన్ను తగ్గింపు ఉంటుంది. సీనియర్ సిటిజన్లకు వడ్డీ రూపంలో వచ్చే ఆదాయంపై రూ.లక్ష వరకూ టిడిఎస్ మినహాయింపు పరిమితి వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్ కార్డుతో చాలా ప్రయోజనాలు ఉన్నప్పటికీ చాలా మందికి పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం, సీనియర్ సిటిజన్ కార్డుపై ప్రభుత్వం ప్రచారం లేకపోవడంతో ఈ కార్డు తీసుకోవడంలో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. 60 ఏళ్లు దాటిన పురుషులు, 58 ఏళ్లు దాటిన మహిళలు సీనియర్ సిటిజన్ కార్డుకి అర్హులు. తప్పనిసరిగా తీసుకుని భద్రపర్చుకోవాలి.

ఉచితంగా కార్డు పొందొచ్చు

సీనియర్ సిటిజన్ కార్డును ఎపి, తెలంగాణలో ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగానే పొందొచ్చు. ఈ కార్డుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలనూ సులభంగా పొందొచ్చు. ఆధార్, ఇతర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు చూపించాల్సిన అవసరం లేదు. 2006లో అప్పటి కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ మేరకు ఆఫీస్ మెమోరాండం జారీ అయింది. అప్పటి నుంచి ఇది అమలవుతోంది. కన్నబిడ్డల నిరాదరణకు గురైన వారు, ఏ ఆధారం లేని అనాథ వృద్ధులు ఆశ్రమాల్లో సేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది.

ఎలా దరఖాస్తు చేసుకోవాలంటే..

60 ఏళ్లు దాటిన పురుషులు, 58 ఏళ్లు దాటిన మహిళలు ఈ కార్డు కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. లేదా జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుల ఆఫీసులోనూ తీసుకోవచ్చు. జిల్లా కార్యాల యంలో అప్లై చేసుకున్న రోజే కార్డును ఇస్తారు. గ్రామాల్లో ఉన్న వారికి వారంలో కార్డుని మంజూరు చేస్తారు. దరఖాస్తుకు పాస్‌ఫోటో, వయసును నిర్ధారించేందుకు ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా, తదితర సర్టిఫికేట్లు సమర్పించాలి. ఈ కార్డు దేశవ్యాప్తంగా చెల్లుబాటు అవుతుంది.

బోటు మునిగినా... ఆశ మునగలేదు

- నడిసంద్రంలో బోటు బోల్తా
- ఐదుగురు మత్స్యకారులకు తప్పిన ముప్పు
- రూ.4 లక్షల ఆస్తి నష్టం

వేటకు వెళ్లిన ఓ బోటు నడి సంద్రంలో మునిగినా, అందులో ఉన్న మత్స్యకారులకు తాము క్షేమంగా ఇంటికి వస్తామని ఎదురుచూస్తున్న తమ భార్య, బిడ్డల ఆశ మునగనీయ లేదు. ఊపిరి బిగబట్టి, అలలకు ఎదురొడ్డి, ప్రాణాలతో పోరాడి చివరికి ఒడ్డుకు చేరుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ప్రజాశక్తి- కవిటి

వివరాల్లోకి వెళ్తే కవిటి మండలం కొత్తపాలెంకు చెందిన బైపిల్లి దాశరాజు ఎప్పటిలాగే తన నలుగురు సహచరులు బైపిల్లి దానయ్య, పుక్కళ్ల పురుషోత్తం, పుక్కళ్ల రాజు, డొంక కృష్ణమూర్తితో శుక్రవారం ఉదయం సముద్రంలోకి వేటకు వెళ్లాడు. కొంత దూరం వెళ్లాక అప్పటివరకు ప్రశాంతంగా కనిపించిన సముద్రం ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చింది. పెద్దపెద్ద అలలు ఎగిసి పడడంతో బోటు నడి సముద్రంలోనే బోల్తా పడింది. దీంతో ఒక్కసారిగా గాల్లోకి ఎగిరిన వీరి ప్రాణాలు నీటిలో కొట్టుకుంటూ ఊపిరాడని క్షణాలుగా మారాయి. అరచేతిలో ప్రాణం పెట్టుకుని నీటిలో ఈదుకుంటూ కొట్టుకుంటూ ఉన్న వీరికి అక్కడే వేటలో ఉన్న ఇతర మత్స్యకారులు గమనించి తాడు విసిరి ఒడ్డుకు చేర్చారు. 'నాలుగేళ్లుగా ఇదే బోటుపై ఆధారపడి బతుకుతున్న నా కుటుంబం, నా బతుకు దిక్కు ఈరోజు మునిగిపోయింది. ఇప్పుడు నా పిల్లలకు పాలు తేవాలంటే ఎవరి తలుపు తట్టాలి?' అంటూ దశరాజు కన్నీటి మాటలు చెబుతుంటే తీరంలో సంద్రం ఘోష ఆగిపోయి నిశ్శబ్దం అలుముకుంది. ఈ ప్రమాదంలో బోటు, ఇంజిన్, వలలు, వేట సామగ్రి అన్నీ కలిపి సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని దశరాజు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ చెబుతున్నాడు. 'బతుకు బాటలో ఓసారి కాదు ఎన్నోసార్లు మునిగాం. కానీ, ఈసారి మళ్లీ తేలే శక్తి కోసం ఎవరో కరుణ చూపాలి. ప్రభుత్వం సహాయం చేస్తే మేము మళ్లీ సముద్రంలోకి వెళ్లగలుగుతాం' అని దశరాజు, మిగతా మత్స్యకారులు నిర్జీవమైన స్వరంతో వేడుకున్నారు.



ఒడ్డుకు లాగుతున్న మత్స్యకారులు



తిరుపతి మృతదేహం (ఇన్‌సెట్‌లో తిరుపతి ఫైల్)

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పలాస

మండలంలోని ఉదయపురానికి చెందిన రాయల తిరుపతి (49) శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కాశీబుగ్గ ఎఎస్ఐ ప్రకాశరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి వెల్డింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యం తాగే అలవాటు ఉంది. కొద్ది కాలం నుంచి విపరీతంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. గ్రామానికి సమీపంలో మండపంపై నిద్రపోతానని చెప్పి వెళ్లాడు. ఎప్పటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు మండపం వద్దకు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య శాంతి, కుమారులు అచ్యుతరావు, మనోజ్ ఉన్నారు. ఎఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లారీని బయటకు తీస్తున్న క్రేన్‌లు

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని వావిలపల్లిపేట కూడలిలో ఆదివారం ఉదయం ఒడిశాకు చెందిన ఊక లారీ బోల్తా పడిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. రాజాం నుంచి చిలకపాలెం వైపు వెళ్తున్న లారీ మలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో లారీలో ముగ్గురు ఉన్నప్పటికీ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో రెండు క్రేన్‌ల సహాయంతో లారీని బయటకు తీశారు.

ఆమె నేత్రాలు సజీవం



లక్ష్మి (ఫైల్)

శ్రీకాకుళం సిటీ: నగరంలోని పిఎన్ కాలనీకి చెందిన ఆర్.లక్ష్మి (86) ఆదివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు తెలియజేశారు. మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పూతి సుజాత ఆమె కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 78426 99321 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ముమ్మరంగా డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

పొందూరు: మండల కేంద్రంలో పలు కిరాణా దుకాణాల్లో ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం డాగ్‌స్క్వాడ్ తనిఖీలను ముమ్మరంగా చేపట్టారు. గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో భాగంగా కాంప్లెక్స్ సమీపంలో దుకాణాల్లో ఈ తనిఖీలను జరిపారు. గంజాయి, డ్రగ్స్‌ను ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దుకాణాదారులను ఎస్ఐ హెచ్చిరించారు.

సాహితీ పుస్తకాలు ఆవిష్కరణ

శ్రీకాకుళం సిటీ: ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి చిగురుపల్లి ప్రభాకరరావు తన భార్య చంద్రకళ జ్ఞాపకార్థం ప్రచురించిన రెండు సాహితీ, అభ్యుదయ పుస్తకాలను ఆదివారం పట్టణంలోని బాపూజీ కళా మందిర్‌లో పలువురు ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.మదన్మోహన్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. 'గీసి చేరిపే బొమ్మ', 'ఉరికంభం సాక్షిగా' పుస్తకాలు ఆవిష్కరణ అనంతరం వాటి పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సాహితీ, స్రవంతి, శ్రీకాకుళం సాహితీ, జన సాహితీ వంటి సాహిత్య, ఉపాధ్యాయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



లోకేష్‌ను కలిసిన వెంకటరమణ

లోకేష్‌ను కలిసిన కలమట

కొత్తూరు : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ కలిశారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జూలై 2న నుంచి చేపడుతున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' అంటూ గ్రామాల్లో పర్యటన చేసేందుకు లోకేష్ దిశా నిర్దేశం చేశారు.

జర్నలిస్టులకు పింఛను అందించాలి

పలాస : జర్నలిజాన్ని వృత్తిగా నమ్ముకుని 60 ఏళ్ల వయోధిక పాత్రికేయులకు నెలకు రూ.పది వేలు పింఛను మంజూరు చేయాలని ఓల్డ్‌యేజ్ వర్కింగ్ జర్నలిస్టుల సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కర్రి శంకర్‌రెడ్డి కోరారు. పలాసలతో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా వయోభారంతో వృత్తి నుంచి విరమించుకున్న జర్నలిస్టుకు పింఛను మంజూరు చేయాలన్నారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు ప్రమాద బీమా, ఎటువంటి షరతులు లేకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యక్షులు దేవ విశ్వేశ్వరరావు, నాని, సారవకోట విశ్వేశ్వరరావు, బగాది వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

మృతదేహంతో బైఠాయింపు



బైఠాయించిన కొండూరు గ్రామస్తులు

నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- నందిగాం

వజ్రపుకొత్తూరు మండలం బెండి గేట్ సమీపంలో శనివారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో అదే మండలం కొండూరుకు చెందిన చైతన్య (29) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఢీకొన్ని వాహనాన్ని గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లోని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను నందిగాం మండలం కవిటిఅగ్రహారం ఊరు చివరలో దాచిపెట్టడాన్ని గుర్తించారు. ట్రాక్టర్ ఓనర్ పిట్ట అర్జున్‌గా గుర్తించి ఆదివారం వజ్రపుకొత్తూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే ట్రాక్టర్ యజమాని పంచనామా నిర్వహించే వరకు ఉండి అనంతరం కనిపించకుండా వెళ్లిపోయాడు. దీంతో కొండూరు గ్రామస్తులు కోపోద్రిక్తులై మృతదేహాన్ని ట్రాక్టర్ యజమాని గ్రామం కంటిఅగ్రహారం వద్ద రోడ్డుపై న్యాయం చేయాలని బైఠాయించారు. దీంతో రెండు వైపులా వచ్చే వాహనాలు గంట పాటు నిలిచిపోయాయి. అందులో ప్రయాణిస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నందిగాం ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తన సిబ్బంది చేరుకుని చర్చించారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో కాశీబుగ్గ సిఐ తిరుపతిరావు, డిఎస్‌పి వెంకట అప్పారావుకు ఎస్ఐ సమాచారం చేరవేశారు. వారు వచ్చి ఇరు గ్రూపులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అనంతరం మృతదేహాన్ని కొండూరులో దహన సంస్కారాలు నిర్వహించారు.

ఆర్‌టిసి అభివృద్ధికి ఎనలేని కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి డిపో మేనేజర్ రోణంకి సీతారామ నాయుడు సంస్థకు ఎనలేని కృషి చేశారని శ్రీకాకుళం, టెక్కలి డిపో మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, శర్మ, ఎన్.శ్రీనివాసరావు అన్నారు. డిపో మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా యూనియన్ల ఆధ్వర్యాన ఆదివారం సీతారామ నాయుడు, దమయంతి దంపతులకు ఘనంగా సన్మానించారు. ముందుగా కాశీబుగ్గ బస్టాండ్ నుంచి డిపో వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ సీతారామ నాయుడు ఎక్కడ పనిచేసిన ఆర్‌టిసి సంస్థ లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సీతారామ నాయుడు కుమారుడు రోణంకి దవలేష్, భార్గవి, అల్లుడు మెట్ట శ్రావణ్, స్వర్ణ, శ్రీకాకుళం డిపో డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.డి.కుమార్, అప్పలరాజు, ఎన్ఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి.రావు, హెచ్.వి.మూర్తి, డిప్యూటీ మేనేజర్ పినకాన సంతోష్‌కుమార్, రామ్మోహనరావు, ఎస్‌డిఐ ప్రసాద్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- లావేరు

స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యార్థులు దిన, వార, మాస పత్రికలు చదివారు. కథలు చదివి వినిపించారు. అనంతరం యోగాసనాలు విద్యార్థులతో వేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకుడు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

చిట్టడవిని తలపిస్తోన్న పిహెచ్‌సి

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులోని మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయం సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (పిహెచ్‌సి) చిట్టడవిని తలపిస్తుంది. పిహెచ్‌సి పరిసరాల్లో డొంకలు, ముళ్ల పొదలు, పుట్టలతో నిండి ఉండడంతో పిహెచ్‌సికి వచ్చే రోగులు విషసర్పాలు, కీటకాలు ఎటువైపు నుంచి వచ్చి ఎవరకి హాని తలపెడతాయోనని భయాందోళన చెందుతున్నారు. వైద్యులకు కనీసం జంగిల్ క్లియరెన్స్ చేయించాలన్న ఆలోచన లేకపోవడం ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు. ఈ పిహెచ్‌సికి సుమారు 35 గ్రామాల నుంచి రోజూ రోగులు వందలాదిగా వస్తుంటారు. వైద్యులు, సిబ్బంది మాత్రం పాములు వచ్చేస్తాయనే భయంతో తలుపులు, కిటికీ తలుపులు తియ్యకుండా వారి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరి పిహెచ్‌సికి వచ్చే రోగుల పరిస్థితి ఏమిటని పలువురు ఆవేదన చెందుతున్నారు. జిల్లా వైద్యాధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయిం చేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ముళ్ల పొదలు, డొంకల మధ్య ఉన్న పిహెచ్‌సి

ఆర్‌టిసి అభివృద్ధికి అంకితం

ఆర్‌టిసి డిపో మేనేజర్ సీతారామనాయుడు



ప్రజాశక్తి- పలాస

రైతు కుటుంబంలో పుట్టిన ఆయన ఆర్‌టిసి డిపో మేనేజర్ వరకు ఎదిగారు. తండ్రి వ్యవసాయం చేస్తూ చదివించడంతో ఉన్నత చదువులు చేపట్టి పిన్న వయసులోనే ఉద్యోగంలో చేరారు. వ్యవసాయంపై మక్కువ ఉన్నా... చదువు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగం రావటంతో ప్రజాసేవకు అంకితమయ్యారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి దగ్గరా అవార్డులు సొంతం చేసుకున్నారు రోణంకి సీతారామ నాయుడు. తమ బంధువుల అమ్మాయిని వివాహం చేసుకుంటూ తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించి ప్రయోజకులు అయ్యే వరకు కృషి చేశారు. 1963 జూన్ 15లో జన్మించి 1987 జూలై 13లో ఉద్యోగంలో చేరి ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు.

కుటుంబ నేపథ్యం...

పోలాకి మండలం ఉరజాంకు చెందిన రోణంకి దవళం నాయుడు, అమ్మనమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. మూడో సంతానం సీతారామ నాయుడు. ఉరజాంలో 1963 జూన్ 15న జన్మించారు. అదే గ్రామానికి చెందిన తమ బంధువుల అమ్మాయైన దమయంతితో 1987లో వివాహమైంది. వీరికి కుమార్తె స్వర్ణ ఎంఎస్‌సి, పిహెచ్‌డి, శాస్త్రవేత్త అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ ఇండియన్ మిల్లెట్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. కుమారుడు దవలేష్ బిటెక్ కెమికల్ ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకుని, హైదరాబాద్ న్యూ ల్యాండ్ ఫార్మా కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు.

విద్యాభ్యాసం.

సీతారామ నాయుడు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సొంత గ్రామమైన ఉరజాంలో విద్యా అభ్యసించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు పోలాకి ఉన్నత పాఠశాలలో చదివారు. కళింగపట్నంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చేశారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ పూర్తి చేశారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో ఎంఎ పాలిటెక్నిక్ చేస్తుండగా, ఆర్‌టిసి డిపోలో గ్రేడ్-2 ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం రావటంతో పిజి సగంలోనే విడిచిపెట్టారు.

38 ఏళ్లు సర్వీస్

గ్రేడ్-2 ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సంపాదించి 1987 జూలై 13న హైదరాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ అకాడమీలో శిక్షణ పొందారు. అనంతరం 1989 జూలై 13న విజయనగరం డిపోలో గ్రేడ్-2 ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. 1996లో అదే డిపోలో ఉద్యోగోన్నతి పొంది సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఏడాది పాటు విధులు నిర్వహించారు. 1997 నుంచి 1999 వరకు టెక్కలి ఆర్‌టిసి డిపోలో పనిచేశారు. 1999 నుంచి 2004 వరకు శ్రీకాకుళంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో పదోన్నతి పొంది మహబూబ్ నగర్ డిపోకు చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ నుంచి 2013 వరకు పలాస, శ్రీకాకుళంలో డిపోల్లో పనిచేశారు. 2013లో ఉద్యోగోన్నతి పొంది కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ డిపో మేనేజర్‌గా వెళ్లారు. అక్కడ నుంచి తూర్పుగోదావరి, జిల్లా రామచంద్రపురం, పాడేరు బదిలీపై వెళ్లారు. 2023 జూన్‌లో పలాస డిపో మేనేజర్‌గా వచ్చారు.

అవార్డులు

సీతారామ నాయుడు ఎక్కడ పని చేసినా అవార్డులు సొంతం చేసుకోవడం అలవాటుగా మార్చుకుంటున్నారు. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ డిపోలో పని చేస్తున్న సమయంలో యాక్సిడెంట్ రేటు తక్కువగా ఉండడంతో 2015 ఏడాది అప్పట ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సాంబశివరావు చేతుల మీదుగా షీల్డ్, రూ.7 వేలు నగదు బహుమతి అందుకున్నారు. రాజమండ్రి గోదావరి పుష్కరాలు సమయంలో సర్వీస్ ఎక్కువగా చేయడం, ప్రజలకు అందుబాటులో బస్సులు ఏర్పాటు చేయడంతో అప్పటి వైస్ చైర్మన్ సాంబశివరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రామచంద్రపురం డిపోలో బస్సులు షెడ్యూల్ మార్పు చేసి ఆ డిపో లాభాల బాటలో నడిచేందుకు ఎంతో కృషి చేశారు. డ్రైవర్లకు అవగాహన కల్పించి డీజిల్ తగ్గించి (కెఎంపిఎల్) నడపడంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రామచంద్రపురం డిపో ఐదో స్థానంలో నిలిచింది. పాడేరులో గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో బస్సులు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి పది కొత్త సర్వీసులు వేసి అందుబాటులో బస్సు సౌకర్యం కల్పించారు. ఏప్రిల్, మే నెలల్లో పలాస డిపోలో గ్యారేజ్, ట్రాఫిక్ లక్ష్యాలను సాధించారు. ఆదాయం రాని ట్రిప్పులు తగ్గించి ఆదాయం వచ్చే ట్రిప్పులు పెంచారు.